

క్రీడా సింధూరం!

జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడలో భారీ ర్యాలీ జరిగింది. ర్యాలీలో బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఐఎంజీ స్టేడియం నుంచి డీవీ మేనర్ వరకు క్రీడాకారులు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. 6లో..

హైలెస్సో.. హైలెస్సా..!

- కృష్ణానది పాయలకు మళ్లీ వరద
- పడవల్లో జనం ప్రయాణం

తోట్లవల్లూరు మండలంలోని కృష్ణా నదీపాయలకు భారీగా వరద చేరుతోంది. గురువారం మధ్యాహ్నం నుంచి వరద పెరిగింది. కొన్ని రోజులుగా తగ్గిన వరద మళ్లీ పెరగటంతో లంక గ్రామాల ప్రజలకు, రైతులకు మళ్లీ పడవ ప్రయాణం మొదలైంది. లంక పొలాల నుంచి అరటి గెలలు, కూరగాయలు తీసుకు వచ్చేందుకు పడవలను ఉపయోగిస్తున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా ఇదే పరిస్థితి. పంటలకు ఎరువు కట్టలను తీసుకెళ్లేందుకు చాలా కష్టపడాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. – తోట్లవల్లూరు



తోట్లవల్లూరు పాయకు భారీగా చేరిన వరద

ఇసుక హుళక్కి

2 లక్షల మెట్రిక్ టన్నులు మాయం

నందిగామ నేత యథేచ్ఛగా దందా



కీసర స్టాక్ యార్డులో ఇసుక లోడింగ్

- టీడీపీ నాయకులు, అధికారులు కుమ్మక్కు
- కీసర స్టాక్ యార్డులో జూన్ 6న 2.24 లక్షల మెట్రిక్ టన్నులు నిల్వ
- ఆగస్టు 28కి అమ్మింది 80 వేల మెట్రిక్ టన్నులే
- ఉండాల్సింది 1.44 లక్షల మెట్రిక్ టన్నులు
- ఉన్నది 40 వేల మెట్రిక్ టన్నులలోపే
- మిగిలిన స్టాక్‌లలో మరో లక్ష మెట్రిక్ టన్నులు స్వాహా

కంచికచర్ల మండలం కీసర స్టాక్ యార్డులో 2,24,555 మెట్రిక్ టన్నుల ఇసుక ఉన్నట్టు ఈ ఏడాది జూలై 6న సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. ఆగస్టు 28 నాటికి ఈ స్టాక్ యార్డు నుంచి 80,335 మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయం జరిగిందని, టన్ను ఇసుక రూ.290 చొప్పున ప్రభుత్వానికి రూ.2.33 కోట్లు జమ అయిందని తాజా లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. ప్రస్తుతం కీసర స్టాక్ యార్డులో 1,44,220 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉండాలి. కానీ క్షేత్రస్థాయిలో 40వేల మెట్రిక్ టన్నులు కూడా లేదనేది అధికారులు చెబుతున్నారు. అంటే లక్ష మెట్రిక్ టన్నుల ఇసుక మాయం అయింది. ఇది కాకుండా నందిగామ నియోజకవర్గంలోని ఇతర స్టాక్ పాయింట్లలో మరో లక్ష మెట్రిక్ టన్నులతో కలిపి మొత్తంగా జిల్లాలో 2 లక్షల మెట్రిక్ టన్నులు మాయమవడం గమనార్హం.

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలో ప్రజలు ఎదుర్కొన్న ఇసుక కష్టాలకు చెక్ పెట్టేందుకు టీడీపీ ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం ఈ ఏడాది జూలై 8 నుంచి ఉచిత ఇసుక విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఉచిత ఇసుక ప్రారంభించే సమయానికి వర్షాకాలం ప్రారంభం కావడంతో కేవలం ఎన్టీఆర్ జిల్లాలోని 8 స్టాక్ యార్డుల్లో అందుబాటులో ఉన్న 5.54 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందివ్వాలని అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు ఆయా స్టాక్ యార్డుల్లో ఉన్న ఇసుక నిల్వలను అధికారికంగా ప్రకటించారు. ఉచిత ఇసుక ప్రారంభమైన నాటి నుంచి ఇసుక దోపిడీ మొదలైంది.

టీడీపీ నాయకుడి దందా

అధిక ఇసుక నిల్వలు ఉన్న స్టాక్ యార్డులన్నీ నందిగామ నియోజకవర్గ పరిధిలోనే ఉన్నాయి. దీంతో స్థానిక టీడీపీ నాయకుడు, ఆయన బంధుగణం ఇసుక దోపిడీకి తెరదీశారు. ఈ దోపిడీకి నిలువెత్తు నిదర్శనమే కీసర స్టాక్ యార్డులోని ప్రస్తుత నిల్వ. ఒక్క కీసర లోనే కాదు మోగలూరులో జూలై 6 నాటికి 1,39,865 మెట్రిక్ టన్నుల నిల్వ ఉండగా ఇక్కడా సుమారు 50 వేల మెట్రిక్ టన్నుల ఇసుక పక్కదారి పట్టింది. ప్రభుత్వం లోడింగ్ ఖర్చుల కింద టన్నుకు రూ.290 వసూలు చేస్తోంది. ఈ దోపిడీ కారణంగా ఆ మొత్తం కూడా ఖజానాకు చేరడం లేదు. మొత్తం 8 స్టాక్ యార్డుల్లో కలిపి సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక దోపిడీ జరిగిందని ఇంటెలిజెన్స్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. అంటే సుమారు రూ.6 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు గండి పడగా.. అంతకు నాలుగైదు రెట్లు నాయకుల జేబుల్లోకి చేరాయి.

ఏం జరుగుతోందంటే..

కంచికచర్లకు చెందిన ఓ టీడీపీ నాయకుడు, ఆయన సోదరుడి కుమారుడు నియోజకవర్గంలోని ఇసుక రీచ్‌లన్నింటినీ తమ గుప్పిట పట్టారు. కీసర స్టాక్ యార్డుకు మండల పరిషత్ అధికారి ఒకరిని పర్యవేక్షణాధికారిగా నియమించారు. ఈయనకు లారీకి వెయ్యి రూపాయిలు ఇస్తే ఎలాంటి సీరియల్‌తో పనిలేకుండా లారీలను లోడింగ్ చేసేస్తున్నారు. ఈ అధికారే తనకు డబ్బులు ఇచ్చిన వారి లారీలకు ఆన్‌లైన్‌లో బుకింగ్ చేసేస్తున్నారు. టీడీపీ నాయకుల లారీలకు ఆన్‌లైన్ బుకింగ్‌తో పనిలేదు. నేరుగా స్టాక్‌యార్డులోకి వెళ్లడం ఇసుక తీసుకుపోవడమే. మోగులూరు స్టాక్‌యార్డు పర్యవేక్షణాధికారిగా పరిటాల గ్రామ పంచాయతీ సెక్రటరీని నియమించారు. ఈయన కూడా టీడీపీ నాయకుల లారీలకు అడ్డు చెప్పడం లేదు. తమ లారీలను అడ్డుకోకుండా ఉన్నందుకు నెలకు ఇంతని మామూలు రూపంలో ఈయనకు ముట్టచెబుతున్నట్లు సమాచారం.

శాఖల పర్యవేక్షణ శూన్యం

కీసర స్టాక్‌యార్డు అక్రమాలపై ఆరోపణలు వస్తుండటంతో గురువారం విజయవాడ మైనింగ్ ఏడీ వీరాస్వామి స్టాక్‌యార్డును సందర్శించారు. 'ఒక రోజు 50 లారీలు స్టాక్ యార్డులోకి వస్తే ఆ 50 లారీలకు టోకెన్లు ఇచ్చి బిల్లులు ఇవ్వమని చెబుతున్నాం. కానీ వంద టోకెన్లు ఎందుకు ఇస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని దరిద్రం నందిగామ స్టాక్ యార్డులోనే ఉంది. మిగిలిన స్టాక్‌యార్డుల్లో 100 నుంచి 200 లారీల్లో లోడ్ చేస్తుంటే ఇక్కడ మాత్రం 70 కూడా పోయలేకపోతున్నారు. టోకెన్లు లేని బండ్లను లోపలికి ఎందుకు రానిస్తున్నారు' అంటూ స్టాక్‌యార్డులోని సిబ్బందిపై ఏడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఓ అధికారి సమక్షంలోనే 12 లారీలు ఇసుక లోడ్‌తో వెళ్లాయి. ఆయన రికార్డులను పరిశీలించగా కేవలం 2 లారీలకే ఆన్‌లైన్ బుకింగ్ టోకెన్లు ఉండటం గమనార్హం.



కొండపల్లి బొమ్మల కళాకారుడు సాంబశివరావుకు అవార్డు ప్రదానం చేస్తున్న సీఎం

కూచిపూడికి పునర్వైభవం

- తెలుగు వారసత్వ సంపదను పరిరక్షించుకుందాం..
- తెలుగు భాషా దినోత్సవంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 'తెలుగు వారి వారసత్వ ఆస్తి అయిన కూచిపూడి నాట్యం ప్రపంచ గుర్తింపును సాధించింది. అయితే, కూచిపూడి గురించి నేటితరం తెలుసుకోలేకపోతోంది. ఈ నాట్యానికి పునర్వైభవం తీసుకొచ్చేలా చేస్తాం. మన తెలుగు భాష, మన నాగరికత, మన సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు కృషి చేస్తాం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతి సందర్భంగా గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో చంద్రబాబు ప్రసంగించారు. తెలుగుజాతి ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉండాలంటే.. భాషపై మమకారంతో పాటు తెలుగు వారసత్వ ఆస్తులైన కళలపై కూడా శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. గిడుగు రామ్మూర్తిని స్ఫూర్తిగా తీసుకుని తెలుగు భాషోద్యమానికి శ్రీకారం చుట్టాలన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా నుంచి వివిధ రంగాల్లో ప్రముఖులైన ఏడుగురికి అవార్డులు, నగదు బహుమతులను సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అందజేశారు.

జడ్పీ బదిలీల్లో కిరికిరి

- తెరవెనుక కథ నడుపుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ భర్త?
- ఎమ్మెల్యేల సిఫార్సు లేఖలను పట్టించుకోబోమని చెబుతున్న వైనం
- ఐదేళ్లుదాటిన వారినే బదిలీ చేస్తామని హుకుం
- అడకత్తెరలో పోకచెక్కలా జడ్పీ ఉద్యోగుల పరిస్థితి

జిల్లా పరిషత్‌లో వింతపోకడలు నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఈ నెలాఖరులోగా బదిలీల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేసినా జడ్పీ చైర్‌పర్సన్ హారిక భర్త తీరుతో ప్రతిష్టంభన నెలకొంది. ఉద్యోగులను బదిలీ చేయాలని జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు సిఫార్సు లేఖలు ఇచ్చినా వాటిని పట్టించుకునేది లేదని, తమ ఇష్టానుసారంగానే బదిలీలు జరుగుతాయని జడ్పీ చైర్‌పర్సన్ భర్త చెబుతుండటంతో ఉద్యోగులు తమ పరిస్థితి ఏమిటని లోలోపలే మదనపడుతున్నారు. రెండు రోజుల్లో ముగియనున్న బదిలీల అంశంలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనన్న ఉత్కంఠ నెలకొంది. జిల్లాలోని శాసనసభ్యులంతా కూటమికి చెందినవారు కావడంతో, జెడ్పీ పాలకవర్గం వైసీపీ ఆధీనంలో ఉండటంతో శాసనసభ్యుల ప్రతిపాదనలను పట్టించుకోకుండా మొండివైఖరికి పోవడంతో బదిలీ వ్యవహారం వివాదాస్పదమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.



ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : ఉమ్మడి జిల్లాలోని జిల్లా పరిషత్ యాజమాన్యంలో ఇంజనీరింగ్ విభాగం, ఎంపీడీవోలు, మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేసే సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, ఇతర విభాగాల్లో పనిచేసే ఉద్యోగులు, పాఠశాలల్లో పనిచేసే రికార్డు అసిస్టెంట్లు, ల్యాబ్‌లలో పనిచేసే ఉద్యోగులు, జిల్లా పరిషత్ ప్రధాన కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులు.. ఇలా మొత్తం 500 మందికిపైగా ప్రస్తుతం జరగనున్న బదిలీల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. వీరిలో అధికశాతం మంది కూటమికి చెందిన శాసనసభ్యుల నుంచి సిఫార్సు లేఖలు తెచ్చుకుని మరీ బదిలీల కోసం దరఖాస్తులను సమర్పించారు. ఉద్యోగుల నుంచి బదిలీల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఆయా విభాగాల వారీగా జాబితాలను అధికారులు తయారు చేసి సిద్ధంగా ఉంచారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఈ దరఖాస్తులను పరిశీలించి అందుకు అనుగుణంగా నిర్ణయం తీసుకుని ఉద్యోగులను బదిలీ చేయాల్సి ఉంది. ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులను తప్పనిసరిగా బదిలీ చేయాలని, జీరో సర్వీసు ఆధారంగా ఉద్యోగులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. ఈ పద్ధతి జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల్లోని అన్ని విభాగాల్లో అమలు చేస్తున్నారు. జిల్లా పరిషత్ యాజమాన్యంలో మాత్రం అమలు చేయబోమని చెబుతుండటం గమనించదగ్గ అంశం. ఐదేళ్లపాటు ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న ఉద్యోగులను మాత్రమే బదిలీ చేస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ వర్గీయులు చెబుతుండటంతో జెడ్పీ యాజమాన్యంలో పనిచేస్తున్న ఉద్యోగుల్లో అలజడి నెలకొంది. బుధవారం వరకు అన్ని విభాగాల్లో మాదిరిగానే జెడ్పీలోనూ బదిలీలు ఉంటాయని ఊహించిన ఉద్యోగులు, గురువారం నాటికి ఎమ్మెల్యేల సిఫార్సు లేఖల ఆధారంగా బదిలీలు చేసేదిలేదనే సంకేతాలు వెలువడటంతో తమ పరిస్థితి ఏమిటనే అంశంపై చర్చించుకుంటున్నారు.

ముందుస్తుగానే పదోన్నతులు ఇచ్చి

సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమిపాలైంది. ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూటమికి చెందిన శాసనసభ్యులు గెలుపొందారు. దీంతో భవిష్యత్తులో ఉద్యోగుల బదిలీలు జరుగుతాయని ముందే ఊహించిన జెడ్పీ చైర్‌పర్సన్, పాలకవర్గం సభ్యులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రెండు విడతలుగా 20 మందికిపైగా జూనియర్, సీనియర్ అసిస్టెంట్‌లకు ఇతర ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చారు. వారిని కోరుకున్న ప్రాంతాలకు బదిలీ చేశారు. తామే ఉద్యోగులకు పదోన్నతులు ఇప్పించామని సోషల్ మీడియాలో తమకు అనుకూలంగా ఉన్న ఉద్యోగులతో ప్రచారం చేసుకున్నారు. కీలకస్థానాలు ఖాళీ లేకుండా ముందస్తుగానే ఉద్యోగులను బదిలీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న బదిలీల్లో వారు కోరుకున్న ప్రాంతాలకు వెళ్లకుండా దారులు మూసేశారు.

కార్యాలయానికి రాని జడ్పీ చైర్‌పర్సన్

సార్వత్రిక ఎన్నికలు ముగిసిన తరువాత వైసీపీ ఓటమి పాలవడంతో జెడ్పీ చైర్‌పర్సన్ కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదు. జెడ్పీ సర్వసభ్య సమావేశం జరిగిన సమయంలో, ఇటీవల ఉద్యోగులకు పదోన్నతుల పత్రాలు అందించే సమయంలో మినహా మిగిలిన రోజుల్లో జెడ్పీ చైర్‌పర్సన్ కార్యాలయానికే రాలేదని ఉద్యోగులు చెబుతున్నారు. దీంతో ఉద్యోగుల ఇబ్బందులు, పరిపాలనాపరమైన అంశాలపై చర్చించేందుకు అవకాశమే లేకుండా పోయిందని ఉద్యోగులు అంటున్నారు. పోనీ జెడ్పీ చైర్‌పర్సన్ ఇంటికి వెళ్లి తమ ఇబ్బందులను చెప్పుకునేందుకు ప్రయత్నిస్తే, ఇంటికి ఎందుకు వచ్చారని, ఆఫీస్‌కు వస్తామని, అక్కడే మాట్లాడతామని జెడ్పీ చైర్‌పర్సన్ భర్త తనదైన శైలిలో చెప్పి ఉద్యోగులను పంపేస్తున్నారు. దీంతో జెడ్పీ ఉద్యోగుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

బదిలీలు సాఫీగా జరిగేనా?

ఉమ్మడిజిల్లాలో జిల్లా పరిషత్ యాజమాన్యంలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీల జాబితాలను శాసనసభ్యులు ఇచ్చిన సిఫార్సు లేఖలు, ఇతరత్రా నిబంధనల మేరకు తయారుచేసి సిద్ధంగా ఉంచారు. అయితే జెడ్పీ చైర్‌పర్సన్ భర్త ఉద్యోగుల బదిలీల అంశంలో తలదూర్చి ఐదేళ్లుగా ఒకే ప్రాంతంలో పనిచేసేవారిని మాత్రమే బదిలీచేస్తామని చెబుతున్నారనే సమాచారం బయటకు పొక్కింది. దీంతో శాసనసభ్యులు జెడ్పీ సీఈవోకు ఫోన్‌చేసి ఉద్యోగుల బదిలీలను ప్రభుత్వ సూచనల మేరకు చేయాలని చెబుతుండటం గమనార్హం. దీంతో జెడ్పీ అధికారుల పరిస్థితి ముందు నుయ్యి, వెనుగొయ్యి అన్న చందంగా మారింది. గతంలోనూ ఉద్యోగుల బదిలీల అంశంలో తమదే తుది నిర్ణయమనే ధోరణిలో జెడ్పీ చైర్‌పర్సన్ వ్యవహరించారు. దీంతో అప్పట్లో జరిగిన బదిలీల్లో అన్యాయానికి గురైన కొందరు ఉద్యోగులు హైకోర్టుకు వెళ్లి తాము కోరుకున్న ప్రాంతాల్లో విధుల్లో చేరారు. ఈ అంశంపై అప్పట్లో జెడ్పీ సీఈవోకు హైకోర్టు అక్షింతలు కూడా వేసింది. ప్రస్తుతం జెడ్పీలో ఉద్యోగుల బదిలీల పరిణామాలు ఎలాంటి మలుపులు తిరుగుతాయనే అంశంపై సర్వత్రా చర్చ నడుస్తోంది.

డెంగ్యూ పంజా

- పక్షం వ్యవధిలో ముగ్గురు మృతి
- పారిశుధ్య నిర్వహణ శూన్యం
- గుడివాడలో జనం బెంబేలు

ప్రభుత్వాలు మారినా అధికారుల్లో మార్పు రావడం లేదు. గుడివాడలో పారిశుధ్యలోపం కారణంగా జ్వరాలు విజృంభిస్తున్నాయి. విష జ్వరాల వల్ల పక్షం వ్యవధిలో ముగ్గురు మృతి చెందడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. మురుగునీటి పారుదల లేక కాలువలు దోమలకు ఆవాస కేంద్రాలుగా మారుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదు. పారిశుధ్య కార్మికుల కొరత, పారిశుధ్య నిర్వహణకు అవసరమైన సామగ్రిని ఏర్పాటు చేయడంలో నిర్లిప్తత కనిపిస్తోంది.



గుడివాడ 16వ వార్డుకు చెందిన 10వ తరగతి విద్యార్థి డెంగ్యూతో మృతి చెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు మరణించడంతో తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమవుతున్నారు.

డెంగ్యూతో ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో గుంటూరులో చికిత్స పొందుతూ గుడివాడ ఆర్ఐ నాగబాబు తల్లి మృతి చెందారు.

ఆర్టీసీ కాలనీకి చెందిన చలసాని రూప గురువారం డెంగ్యూతో మృతి చెందారు. మృతురాలి భర్త కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేదని, వెంటనే మురుగునీరు పారుదలకు చర్యలు చేపట్టాలని పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నా ఎవరూ పట్టించుకోలేదు.

గుడివాడ : గుడివాడలో ఏళ్ల తరబడి డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. అంతర్గత డ్రైన్‌లు మరీ అధ్వానంగా తయారయ్యాయి. మురుగునీరు కదలకపోవడంతో డ్రైనేజీలు దోమలకు ఆవాసంగా మారాయి. ఇటీవల పట్టణంలో ప్రధాన రహదారుల వెంబడి సీల్ట్‌ను తొలగించారు. అంతర్గత డ్రైనేజీలను శుభ్రపరచడం మరిచారు. దోమల వ్యాప్తి పెరిగింది. (మిగతా 6లో)


సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నుంచి అవార్డులు అందుకుంటున్న ఆచంట బాలాజీ నాయుడు


అశోక్‌కుమార్


చల్లపల్లి స్వరూపారాణి


కందిమళ్ల సాంబశివరావు


మల్లాది సూరిబాబు


పి.సత్యనారాయణ రెడ్డి


పాటిబండ్ల ఆనందరావు


ఆచార్య ములే విజయలక్ష్మి


బొర్రా గోవర్ధన్


గిడుగు రామ్మూర్తి పంతులు 161వ జయంతి సందర్భంగా గురువారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవం కార్యక్రమానికి హాజరైన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి కందుల దుర్గేష్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బొండా ఉమ,


కేవీఎన్‌డీ వరప్రసాద్


జి.లక్ష్మి నరసయ్య


మోదుమూడి సుధాకర్


పలమనేరు బాలాజీ


ఎస్.విజయకుమార్


శారదా రామకృష్ణ


వనపర్తి దుర్గారావు


దుర్గగుడిలో హుండీల లెక్కింపు

కనకదుర్గమ్మకు రూ.2.76 కోట్ల కానుకలు

వన్‌టౌన్, ఆగస్టు 29 : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. 18 రోజులకుగాను నగదు రూపేణ రూ.2,76,66,261లు సగటున రోజుకు రూ.15,37,014 కానుకలు వచ్చాయి. కానుకల రూపేణ హుండీలలో 523 గ్రాముల బంగారం, 7 కిలోల 30 గ్రాముల వెండి లభించింది. యూఎస్‌ఏ డాలర్లు 327, ఆస్ట్రేలియా డాలర్లు 35, ఇంగ్లాండ్ పౌండ్లు 10, కెనడా డాలర్లు 5, కువైట్ దినార్లు 2, యూరోలు 25, మలేషియా రింగిట్స్ 1, సౌదీ రియాల్స్ 5, 10 సింగపూర్ డాలర్లు, 98 కతార్ రియాల్స్ లభించాయి. ఈ హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కానుకలు రూ.61,260లు సమకూరాయి.

దుర్గమ్మ సేవలో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి శ్రీసుధ



ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మవారిని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీసుధ దంపతులు దర్శించుకున్నారు. వారికి అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలు కల్పించి అమ్మవారి దర్శనానంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

అన్నవితరణకు విరాళం

విజయవాడ విద్యాధరపురానికి చెందిన ఎ.శ్రీనివాసరావు గురువారం ఆలయానికి విచ్చేసి ఎ.దినేష్ పేరిట అన్న వితరణకు రూ.1,00,000లు ఉప కార్యనిర్వహణాధికారి లీలా కుమార్ ద్వారా చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు.

దుర్గగుడిలో ఇకపై తెలుగు పద్య పురాణం

వన్‌టౌన్, ఆగస్టు 29 : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ప్రతిరోజూ సాయంత్రం నిర్వహించే పంచహారతుల అనంతరం వేదస్వస్తి.. పురాణ పఠనం నిర్వహించనున్నారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గురువారం తొలిసారిగా పురాణపఠనంలో తెలుగుపద్యాలను వినిపించారు. ఇకపై ప్రతిరోజూ పురాణపఠనం అనంతరం తెలుగు నన్నయ్య భారతం, పోతన భాగవతం నుంచి భక్తిరస పూరిత తెలుగుపద్యాలను వినిపించాలని నిర్ణయించారు. సాహిత్య విలువలు ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో, ముఖ్యంగా కృష్ణా, గోదావరి ప్రాంతాల్లో మంచి సాహిత్యం వెల్లివిరిసిందని, తెలుగు సాహిత్య గొప్పతనాన్ని భక్తిరసాన్ని అమ్మవారికి వినిపిస్తే తెలుగుభాషా పరిపుష్టమవుతుందని భావించారు. ఈ క్రమంలో పంచహారతుల సేవలో తెలుగు పద్యాల పఠన కార్యక్రమాన్ని నిర్వహించటం జరుగుతుందని ఆలయ ఈవో కేఎస్ రామారావు తెలిపారు.

వైసీపీ వ్యవస్థలను నిర్వీర్యం చేసింది..
ముంబై నటి ఘటనే నిదర్శనం : దేవినేని ఉమా



గొల్లపూడి, ఆగస్టు 29 : వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయనేందుకు ముంబై నటి, డాక్టర్ కాదంబరి జైత్వానిపై జరిగిన అమానుష ఘటనే నిదర్శమని మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. గొల్లపూడిలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రమేయంతోనే సలహాదారు సజ్జల పోలీస్ అధికారులతో కలిసి ఇంతటి దుర్మార్గానికి ఒడిగట్టారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి స్నేహితుడి కోసం వైసీపీ నేతలు, పోలీసులు కలిసి ఒక మాఫియాలా ఏర్పడి కిడ్నాప్ చేసి నటి, ఆమె కుటుంబాన్ని ఇక్కడకు తీసుకు వచ్చి చిత్ర హింసలకు గురిచేశారన్నారు. ఈఘటనపై పూర్తిస్థాయి విచారణ చేసి జగన్మోహన్ రెడ్డి, సజ్జల, కుక్కల విద్యాసాగర్ సహా బాధ్యులైన ప్రతి ఒక్కరిపైన కఠిన చర్యలు తీసుకోవాలని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పోలీసు అధికారులను తక్షణం సస్పెండ్ చేయాలన్నారు.

నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలి

- ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం



మాట్లాడుతున్న హరిబాబు

పాయకాపురం, ఆగస్టు 29 : కూటమి ప్రభుత్వం కౌలు రైతులతో క్షేత్రస్థాయిలో సంప్రదించి నూతన కౌలు చట్టాన్ని తీసుకురావాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు కోరారు. నగరంలోని సంఘ కార్యాలయంలో గురువారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయంలో సగభాగం కౌలు రైతులు సాగుచేస్తున్నారని రిజర్వ్ బ్యాంక్ స్టేట్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని ఉన్నప్పటికీ క్రిందిస్థాయిలో బ్యాంకుల నుంచి కౌలు రైతులకు రుణాలు అందటం లేదన్నారు. భూ యజమాని అనుమతి లేకపోతే కౌలు గుర్తింపు కార్డులు రావడం లేదని, ఫలితంగా ఈ పంట నమోదవడం లేదన్నారు. ప్రభుత్వం ఇచ్చే పంటల నష్టపరిహారం, బీమా కౌలురైతులకు అందక అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్యలకు పాల్పడితే అవసరమైన సర్టిఫికెట్లు లేక ప్రభుత్వం ఇచ్చే ఎక్స్‌గ్రేషియా కూడా రాకుండా పోతోందని పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం నూతన కౌలు చట్టాలను తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శులు పంచకర్ల రంగారావు, సైదులు, వై.కేశవరావు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఉషోదయ'కు టైమ్స్ బిజినెస్ అవార్డు



లబ్బీపేట, ఆగస్టు 29 : వ్యాపారరంగంలో అత్యుత్తమ పురోగతి సాధించే సంస్థలకు టైమ్స్ ఆఫ్ ఇండియా ప్రతి సంవత్సరం అందించే టైమ్స్ బిజినెస్ అవార్డును ఈ సంవత్సరం ఉషోదయ సూపర్ మార్కెట్‌కు వరించింది. నగరంలోని ఓ హోటల్లో అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి టీజీ భరత్ ఈ అవార్డును అందజేశారు. పలు సంస్థలు తమ వ్యాపార రంగంలో సాధించిన పురోగతిని పరిగణనలోకి తీసుకుని అత్యుత్తమ పురోగతిని సాధించిన సంస్థకు ఈ అవార్డును అందజేశారు. 2024 సంవత్సరం పాపులర్ సూపర్ మార్కెట్ అవార్డును ఉషోదయ సూపర్‌మార్కెట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ బెస్ట్ సూపర్‌మార్కెట్ అవార్డును సాధించింది. ఈ సందర్భంగా మంత్రి భరత్ ఉషోదయ సూపర్ మార్కెట్ అధినేత మన్నవ యుగంధర్‌కు అవార్డును అందజేశారు.

క్రీడారంగానికి మంచిరోజులు

- ఘనంగా జాతీయ క్రీడాదినోత్సవం
- పేద క్రీడాకారుల శిక్షణ, కిట్లకు మంత్రి రూ.3.16లక్షల విరాళం
- ప్రత్యేక ఆకర్షణగా ఒలింపియన్లు సింధు, జ్యోతి, జ్యోతికశ్రీ, ధీరజ్
- క్రీడాకారులతో నగరంలో భారీ ర్యాలీ

క్రీడల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి


ర్యాలీని ప్రారంభిస్తున్న మంత్రి రామ్‌ప్రసాద్, పీవీ సింధు, శాప్ ఎండీ గిరిషా

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 29 : శాప్ ఆధ్వర్యంలో నగరంలోని ఇందిరాగాంధీ నగరపాలక సంస్థ స్టేడియంలో హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్


క్రీడాకారిణితో మంత్రి మాటామంతీ

పుట్టినరోజు సందర్భంగా జాతీయ క్రీడాదినోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా క్రీడల మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి హాజరుకాగా, ప్రత్యేక ఆకర్షణగా పారిస్ ఒలింపియన్లు పీవీ సింధు(బ్యాడ్మింటన్), యర్రాజీ జ్యోతి, దండిక జ్యోతికశ్రీ(అథ్లెటిక్స్), బొమ్మదేవర ధీరజ్(ఆర్చరీ)లు హాజరై స్టేడియం నుంచి డీవీ మేనర్ వరకు క్రీడాకారులు, వివిధ పాఠశాలు, కళాశాలల విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీని నిర్వహించారు. తొలుత ధ్యాన్‌చంద్ చిత్రపటానికి మంత్రి, క్రీడారంగ ప్రముఖులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం క్రీడా కాన్వాస్‌పై సంతకాలు చేశారు. విద్యార్థులు, క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞను చేయించారు. ఈ సందర్భంగా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ, హాకీ క్రీడ ద్వారా దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిన మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడాదినోత్సవంగా జరుపుకోవడం ఆనందంగా ఉందని, క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని, దీంతో క్రీడారంగానికి మంచి రోజులొచ్చాయన్నారు. క్రీడలపై ఆసక్తి కలిగిన వారికి శాప్ నుంచి పూర్తి సహాయ, సహకారాలు ఉంటాయని, ఔత్సాహికులు రిజిస్టర్ చేసుకోవాలన్నారు. పేద క్రీడాకారులకు ఆర్థికంగా సహాయ సహకారాలు అందించేందుకు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు కార్పస్ ఫండ్ ఏర్పాటు చేసే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లనున్నట్టు వివరించారు. శాప్ ద్వారా పేద క్రీడాకారులను గుర్తించి వారికి సరైన శిక్షణ, కిట్లను అందించేందుకు తన నెల జీతం రూ.3.16 లక్షలు మంత్రి విరాళంగా ప్రకటించారు.

ఒత్తిడిని జయించాలి : పీవీ సింధు

ప్రతీఒక్కరూ ఫిట్నెస్‌కు ప్రాధాన్యమివ్వాలి. మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో ఏదొక క్రీడను ఎంపిక చేసుకుని కష్టపడి విజయాలను చేరుకోవాలి. కష్టపడితే ఏ లక్ష్యాన్ని అయినా అలవోకగా చేరుకోవచ్చు. ఒడిదుడుకులను తట్టుకొని నిలవాలి.

క్రీడా ఆణిముత్యాలకు సత్కారం

జాతీయ క్రీడాదినోత్సవం సందర్భంగా మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ వీసీ ఎండీ పీఎస్ గిరిషా, పీవీ సింధు, ఉన్నతాధికారులతో కలిసి క్రీడా ఆణిముత్యాలను ఘనంగా సత్కరించారు. ధీరజ్ శ్రీ కృష్ణ(యోగా) జి.నగేష్‌బాబు(బాస్కెట్‌బాల్), భావన(సాఫ్ట్ టెన్నిస్), ఎం.అంకిత(వాలీబాల్), గిరిబాబు(వాటర్‌స్పోర్ట్స్)లను సత్కరించారు. కార్యక్రమంలో శాప్ ఏడీ వెంకటరమణ, వివిధ విభాగాధిపతులు ఎ.మహేష్, కోటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా డీఎస్‌డీవో ఎస్ఏ అజీజ్, క్రిష్ సీఈవో యు.శ్రీనివాసరావు, వివిధ సంఘాల ప్రతినిధులు కేపీ రావు, నామిశెట్టి వెంకట్, యలమంచిలి శ్రీకాంత్, ఆకుల రాఘవేంద్రలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సాహం : కృష్ణా కలెక్టర్


అవనిగడ్డలో క్రీడాజ్యోతితో ర్యాలీలో కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఆగస్టు 29 : క్రీడాకారులకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తామని కలెక్టర్ బాలాజీ అన్నారు. గురువారం అవనిగడ్డలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కరణం మల్లేశ్వరి, పీవీ సింధు వంటి క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థి స్థాయి నుంచే క్రీడల్లో నైపుణ్యాన్ని సాధించాలని సూచించారు. వ్యాయామోపాధ్యాయులు క్రీడల్లో ప్రతిభ కనబర్చే వారిని గుర్తించి తగిన ప్రోత్సాహం అందించాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, దివిసీమ నుంచి గతంలో ఇద్దరు క్రీడాకారులు ఒలింపిక్స్‌లో పాల్గొని ప్రతిభను చాటారని, వెయిట్ లిఫ్టింగ్‌లో కామినేని శ్రీనివాసరావు 12సార్లు చాంపియన్ షిప్ సాధించారని, బ్యాడ్మింటన్‌లో జమ్ములమడక పిచ్చియ్య అంతర్జాతీయస్థాయిలో రాణించారని, వారికి ప్రభుత్వం అర్జున అవార్డు ఇచ్చి గౌరవించిందని, అలాంటి వ్యక్తులు ఈ ప్రాంతంలో జన్మించటం దివి ప్రాంతానికి గర్వకారణమన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాగాయలంకలో జలక్రీడల శిక్షణా కేంద్రాన్ని మంజూరు చేశారని, అక్కడ శిక్షణ పొందిన పిల్లలు జాతీయస్థాయిలో రాణించారని, ఆ శిక్షణా కేంద్రం అభివృద్ధికి చొరవ చూపాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా అవనిగడ్డ జూనియర్ క్రీడా మైదానంలో 30 అడుగుల జాతీయ పతాకాన్ని ఎగురవేసి క్రీడా జ్యోతితో ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో వాణి, ఎంపీపీ తుంగల సుమతిదేవి, జిల్లా క్రీడా ప్రాధికారసంస్థ అధికారి ఝాన్సీలక్ష్మి, డీఈవో తాహెరా సుల్తానా, జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ, ఎంపీడీవో మరియకుమారి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఉమారాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


మల్కాపురం మునేటికి వెళ్లే మార్గంలో తీసిన కందకం

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట!

- చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్

జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 29 : ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు చిల్లకల్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ శ్రీకారం చుట్టారు. మండలంలోని మల్కాపురం మునేటి నుంచి ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో మునేటికి వెళ్లే మార్గాన్ని ఎస్కవేటర్‌తో కందకం తవ్వించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాలు తెలంగాణాకు సరిహద్దుగా ఉండటంతో అక్రమార్కులు సులువుగా ఇసుక తరలిస్తున్నారన్నారు. వారిని అడ్డుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముక్త్యాల, బూదవాడ, అన్నవరం, గరికపాడు, తక్కెళ్లపాడు, రామచంద్రునిపేట, గండ్రాయి, మల్కాపురం గ్రామాల సరిహద్దులో చెక్‌పోస్టుల బలోపేతంతో పాటు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఇసుక అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు.

నిజాలు నిగ్గు తేల్చండి

- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు

అవనిగడ్డ, ఆగస్టు 29 : డాక్టర్ శ్రీహరిరావు హత్య కేసులో నిజానిజాలను ప్రభుత్వం నిగ్గు తేల్చాలని అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాలుగేళ్ల క్రితం శ్రీహరిరావు హత్య జరగ్గా, దోషులెవరూ పట్టుబడలేదని, పోలీసు అధికారులతో ఈ కేసు గురించి పలుమార్లు ఒత్తిడి తెచ్చినట్టు గుర్తుచేశారు. ఇటీవల శ్రీహరిరావు హత్య కేసును సీబీసీఐడికి అప్పగిస్తున్నట్టు వార్తలు వచ్చాయని, అయితే కొంతమంది ఈ కేసులో తనను దోషిగా చూపించాలని తాపత్రయ పడుతున్నారని, తాను ఏమిటో నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసన్నారు. కార్యక్రమంలో కడవకొల్లు నరసింహారావు, వైసీపీ నేతలు సింహాద్రి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, బాలు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఎంపికలు రేపు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 29 : మొగల్రాజపురం వీపీ సిద్ధార్థ స్కూల్ గ్రౌండ్స్‌లో ఈనెల 31న ఉదయం 9 గంటలకు కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల అథ్లెటిక్స్ అండర్ 14, 16, 18, 20, 23 కేటగిరీల్లో బాలబాలికలు, పురుషుల, మహిళా విభాగాల్లో ఎంపికలను నిర్వహిస్తున్నట్టు కృష్ణాజిల్లా సెక్రటరీ బొడ్డు నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన వారిని సెప్టెంబరు 14 నుంచి 16 వరకు గుంటూరు జిల్లా ఏఎన్‌యూ గ్రౌండ్స్‌లో జరిగే ఏపీ అంతర్‌జిల్లాల(రాష్ట్రస్థాయి) జూనియర్, అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు పంపుతామన్నారు. వివరాలకు కోచ్‌లు కె.కృష్ణమోహన్ 9493101040, జి.వంశీ కిరణ్ 06302822291లలో సంప్రదించాలన్నారు.

తెలుగు మాధుర్యాన్ని చాటి చెప్పండి

- కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ పిలుపు


తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసిన కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 29 : తెలుగు భాషలోని మాధుర్యాన్ని, భాషా విశిష్టతను అందరికీ చాటి చెప్పాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా జేసీ గీతాంజలి శర్మతో కలిసి తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేసి వందనం సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో గురువారం జరిగిన తెలుగు భాషా దినోత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు కవులు, భాషావేత్తలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, తెలుగును వ్యవహారిక భాషగా ప్రజాదరణ కల్పించేందుకు గిడుగు రామ్మూర్తి పంతులు చేసిన కృషి అనన్య సామాన్యమన్నారు. భారతీయ భాషల్లో తెలుగుకు ప్రత్యేకత ఉందన్నారు. మన భాషపై ఆంగ్ల పెత్తనం అవసరం లేదన్నారు. ఆంగ్లభాష రాని తల్లిదండ్రులు తమ పిల్లలు కొన్ని ఆంగ్ల పదాలు మాట్లాడితే మురిసిపోతున్నారని, వాస్తవికంగా పిల్లలకు అటు ఆంగ్లభాషపై, ఇటు తెలుగుభాషపై పట్టు లేకుండా పోతోందన్నారు. మాతృభాషలో పట్టు ఉంటే మిగిలిన భాషల్లో పట్టు సులభంగా వస్తుందన్నారు. దేశంలో రెండు వేల ఏళ్ల కితమే తెలుగు భాష ఆవిర్భవించిందన్నారు. ప్రాచీన భాషల్లో తెలుగుభాష ఆరవ భాషగా పేరు పొందిందన్నారు. కాగా కార్యాలయాల్లో ఉత్తరప్రత్యుత్తరాలు తెలుగులోనే జరపాలని, తెలుగుభాషను పాలనాభాషగా చేయాలని కవులు, పండితులు కలెక్టరుకు మహజరు సమర్పించారు. పాఠశాలల్లో తెలుభాషను మాధ్యమంగా ఉంచాలని కోరారు. ఈ సందర్భంగా కవులు చింతల పాటి మురళీకృష్ణ, ఎంవీజీ ఆంజనేయులు, పన్నారం సాంబశివరావు, కారుమూరి రాజేంద్రప్రసాద్, గుత్తికొండ సుబ్బారావు, ధన్వంతరి ఆచార్య, ఎండీ సిలార్, అంబటిపూడి సుబ్రహ్మణ్యం, మేడిశెట్టి యోగేశ్వర రావు, వెచ్చ సత్యనారాయణ మూర్తి, ధూళిపూడి రామభద్ర ప్రసాద్, ఎన్‌బాబులను కలెక్టరు ఘనంగా సత్కరించారు.

స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు

- ఎస్‌జీఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు

విజయవాడ స్పోర్ట్స్ : పాఠశాల స్థాయిలో క్రీడలను మరింత ప్రోత్సహించేందుకు ఉత్తమ క్రీడాకారులకు స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేయనున్నట్టు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. నగరంలోని ఎన్టీఆర్ జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో గురువారం అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి భానుమూర్తి రాజు మాట్లాడారు. రాష్ట్రంలోనే స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్‌లో రెండో స్థానం నున్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సాధించడం గర్వకారణమన్నారు. తొలుత హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం జిల్లాలో ప్రథమ, రాష్ట్రంలో రెండో స్థానం సాధించిన నున్న హైస్కూల్ హెచ్ఎం వజ్రాల భూపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు టి.విజయవర్మ, టి.శ్రీలతను సత్కరించి ప్రశంసాపత్రం, జ్ఞాపికలను అందజేశారు.

డెంగ్యూ పంజా

(5వ పేజీ తరువాయి)

దీంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో టైఫాయిడ్, డెంగ్యూ విజృంభిస్తోంది. పలుమార్లు స్థానికులు ఫిర్యాదు చేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. స్థానిక ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తన తల్లి డెంగ్యూ బారిన పడటంతో వెంటనే పట్టణంలో పారిశుధ్య నిర్వహణ మెరుగుపరచాలని సమీక్ష నిర్వహించి అధికారులు ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాలను సైతం మున్సిపల్ అధికారులు పక్కన పెట్టేశారు. ఒకటీ రెండు రోజులు హడావుడి చేసి పారిశుధ్య నిర్వహణను గాలికి వదిలేశారు.

● **ఆసుపత్రులన్నీ కిటకిట**

టైఫాయిడ్, డెంగ్యూ రోగులతో ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి. ముఖ్యంగా చిన్నారులు ఎక్కువగా టైఫాయిడ్ బారినపడుతున్నారు. పట్టణంలో డెంగ్యూ కేసులు 40 నుంచి 50 శాతం పెరిగాయని వైద్యులు పేర్కొంటున్నారు. ప్రభుత్వాసుపత్రితో పాటు ప్రైవేటు ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయి.

● **పక్షం వ్యవధిలో ముగ్గురు మృతి**

మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో విషజ్వరాలు, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూలతో ప్రజలు మంచమెక్కారు. ఇప్పటికే పలువురు మలేరియా, చికెన్‌గున్యా, డెంగ్యూ బారిన పడి కోలుకోగా, మరికొందరు చికిత్స పొందుతున్నారు. ఇటీవల పట్టణంలో పక్షం వ్యవధిలో ముగ్గురు మృతి చెందటం ఆందోళన కలిగిస్తోంది. ప్రతి ఇంటిలో కనీసం ఒకరైన జ్వరంతో బాధపడుతున్నారు.

● **ముమ్మాటికి మున్సిపల్ హత్యలే**

శివారు ప్రాంతాలతో పాటు, పలు కాలనీల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందని ప్రజలు మున్సిపల్ అధికారులు దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకున్న దాఖలాలు లేవు. స్థానిక ఆర్టీసీ కాలనీకి చెందిన వ్యక్తి మురుగునీరు పారుదల కావడం లేదని, వెంటనే చర్యలు చేపట్టాలని పలుమార్లు కార్యాలయం చుట్టూ తిరిగారు. అయినా అధికారుల్లో చలనం లేదు. ఎక్కడా దోమల నివారణకు డ్రైన్‌లలో పిచికారీ చేసిన దాఖలాలు లేవు. ముందస్తు జాగ్రత్తలు కూడా తీసుకోకపోవడంతో పరిస్థితి దారుణంగా ఉంది. దీంతో పట్టణంలో డెంగ్యూతో ముగ్గురు మృతి చెందారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.25

ఐదు నెలలుగా జీతాల్లేవ్

ఆర్థిక సమస్యలతో శానిటేషన్ సిబ్బంది సతమతం

ఉయ్యూరు, ఆగస్టు 29: ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బందికి ఐదు నెలలుగా జీతాలందక ఇబ్బంది పడుతున్నారు. వైద్యవిధాన పరిషత్ ఆధీనంలో ఉన్న ఈ వైద్యశాలలో 8 మంది శానిటేషన్ సిబ్బంది, సూపర్‌వైజర్లు కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. ఐదు నెలల నుంచి జీతాలు రాకపోవడంతో ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోతే ఏం తినాలని వారు ప్రశ్నిస్తున్నారు. జీతాలు చెల్లించి ఆదుకోవాలని కోరుతున్నారు. పీఎఫ్ కూడా కట్టడంలేదని వాపోయారు. శానిటేషన్ సిబ్బంది జీతాల పెండింగ్ సమస్యపై వైద్యశాల సూపరింటెండెంట్ మురళీని వివరణ కోరగా.. కాంట్రాక్టు సూపర్‌వైజర్‌కు పరిస్థితి తెలియజేశామని, త్వరలో జీతాలు చెల్లించేలా చూస్తామని తెలిపారు.







ఉయ్యూరు ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల, రేమల్లె హైస్కూల్‌లో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆత్కూరులో తెలుగు పండితులను సత్కరిస్తున్న డీపీఆర్టీయూ నేతలు

మధుర భాష తెలుగు

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం ● గిడుగు రామ్మూర్తికి ఘన నివాళి

గిడుగు రామ్మూర్తి జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఉపాధ్యాయులు, అధ్యాపకులు గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు ఘనంగా నివాళులర్పించారు. మధుర భాష తెలుగు అని పలువురు వక్తలు పేర్కొన్నారు.

ఉయ్యూరు, ఆగస్టు 29: గ్రాంధిక భాషగా ఉన్న తెలుగు వచనాన్ని వాడుక భాషలోకి తెచ్చి, వ్యవహారిక భాషలో ఉన్న అందాన్ని తెలియజెప్పిన మహనీయుడు గిడుగు వెంకటరామ్మూర్తి అని ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ అన్నారు. గిడుగు రామ్మూర్తి 161వ జయంతిని పురస్కరించుకుని కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో గురువారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాషోద్యమానికి గిడుగు మూలపురుషుడని కొనియాడారు. గిడుగు రామ్మూర్తి వల్ల తెలుగును సామాన్యులు కూడా చదవగలుగుతున్నారని జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్‌కుమార్ తెలిపారు. హిందీ, బెంగాలీ తరువాతి స్థానంలో తెలుగు నిలిచిందన్నారు. తెలుగు గొప్పదనాన్ని గుర్తించిన కేంద్రప్రభుత్వం 2008లో కన్నడ భాషతో పాటు తెలుగు భాషకు కూడా ప్రాచీన భాష హోదాను కల్పించిందన్నారు. తెలుగు శాఖాధిపతి ఎంఎల్ఎస్ కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

తెలుగు పరిరక్షణకు గిడుగు కృషి

హనుమాన్‌జంక్షన్: పరభాషా జడిలో తెలుగు భాషను మరిచిపోకూడదనే నినాదంతో వ్యవహారిక భాషను బతికించడానికి గిడుగు రామ్మూర్తి పంతులు విశేష కృషి చేశారని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. మానవత కార్యాలయంలో గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి వేడుకను నిర్వహించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు నిడమర్తి లలిత కామేశ్వరిని సత్కరించారు. రామ్మూర్తి చిత్రపటం వద్ద మానవత సభ్యులు నివాళి అర్పించారు. రేమల్లె జడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం లూథర్‌పాల్ ఆధ్వర్యంలో తెలుగు భాషా ఉద్యమకారులు గిడుగు రామ్మూర్తి, కందుకూరి వీరేశలింగం, తెలుగు తల్లి చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యవహారిక భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మానవత సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెలుగు పరిరక్షణ అందరి బాధ్యత

గన్నవరం: తెలుగు భాషను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైన ఉందని హెచ్ఎం సగ్గుర్తి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పాఠశాలల్లో గిడుగు రామ్మూర్తి జయంతిని నిర్వహించారు. ఉపాధ్యాయులు గుర్రం రాజాబాబు, గణపతిరావు, లక్ష్మణరావు, మణిరాజు పాల్గొన్నారు.

మాతృభాషను నిర్లక్ష్యం చేయొద్దు

ఉంగుటూరు: పరభాష మోజులోపడి మాతృభాషను నిర్లక్ష్యం చేయవద్దని డెమొక్రాటిక్ ప్రోగ్రెసివ్ రీఆర్గనైజ్డ్ టీచర్స్ యూనియన్(డీపీఆర్టీయూ)రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను పేర్కొన్నారు. డీపీఆర్టీయూ, ఉపాధ్యాయ సేవాదళ్ ఆధ్వర్యంలో హెచ్ఎం కేవీబీకే సుధాకర్ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవాన్ని ఆత్కూరు జడ్పీహైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. తెలుగు పండితులకు ప్రత్యేక పురస్కారాలు అందజేసి సత్కరించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. పి.వెంకటేశ్వరరావు, ఎంఎస్‌వీ నాగేంద్ర, నాలాది జోజయ్య, పి.సాంబశివరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల వద్ద డ్రెయిన్ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

దసరాకు సిద్ధార్థ పైవంతెనను
వినియోగంలోకి తెస్తాం: బోడె ప్రసాద్

పెనమలూరు, ఆగస్టు 29: దసరా పండుగ నాటికి వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో నుంచి పోతున్న పైవంతెనను వినియోగంలోకి తెస్తామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. సిద్ధార్థ కళాశాల ప్రాంగణంలో నిర్మిస్తున్న డ్రెయిన్లను ఆయన గురువారం పరిశీలించారు. త్వరగా వంతెనను అందుబాటులోకి తెచ్చేందుకే డ్రెయిన్ల నిర్మాణం వేగవంతం చేశామని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వెంట టీడీపీ సీనియర్ నాయకుడు అనుమోలు ప్రభాకరరావు ఉన్నారు.

నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళికపై వర్క్‌షాప్ నేడు

వికసిత్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా వచ్చే ఐదేళ్లలో పెనమలూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించడంపై కానూరు ఆహ్వానం కల్యాణ మండపంలో శుక్రవారం వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ తెలిపారు. కలెక్టర్, మండల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించాలి



ఉంగుటూరు పీహెచ్‌సీలో డాక్టర్‌తో మాట్లాడుతున్న ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి

ఉంగుటూరు, ఆగస్టు 29: వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేదలకు మెరుగైన వైద్యసేవలందించాలని టీడీపీ మండలాధ్యక్షుడు ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి సూచించారు. విషజ్వరాలు ప్రబలుతున్నందున మండలంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో(పీహెచ్‌సీలు) వసతులు, సౌకర్యాలతోపాటు, ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించడంతో గురువారం ఉంగుటూరు నూతన పీహెచ్‌సీని స్థానిక టీడీపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఆస్పత్రికి వచ్చిన ఔట్ పేషెంట్లను పరామర్శించి వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పీహెచ్‌సీలో 24గంటలూ మూడు షిఫ్టుల్లో ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నామని, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే థియేటర్, కాన్పులుచేసే లేబర్‌రూమ్‌లు ఫ్లోరింగ్ చేయకుండా అసంపూర్తిగా వదిలేయడం, వైద్యఆరోగ్యసిబ్బంది కొరత ఉండడం వల్ల ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్యసేవలు అందించలేకపోతున్నామని వైద్యసిబ్బంది ఆయనకు వివరించారు. ఆస్పత్రిలో సమస్యలను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఆరుమళ్ల హామీ ఇచ్చారు. వైద్యాధికారిణి డాక్టర్ కె.భవాని, స్టాఫ్ నర్స్ సౌమ్య, టీడీపీ నాయకులు ఈడ్పుగంటి కృష్ణమూర్తి, తొమ్మండ్రు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న డీవైఈవో పద్మారాణి

విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు

ఉయ్యూరు, ఆగస్టు 29: కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల్లో కొందరు విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్లు ఇటీవల వెలుగులోకి వస్తున్నాయని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీవైఈవో పద్మారాణి హెచ్చరించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ఉయ్యూరు, మండల పరిధిలోని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఉపాధ్యాయులు అందరికీ ఆదర్శవంతంగా ఉండాలని పట్టణ ఎస్సై విశ్వనాథ్ సూచించారు. బాలలపై లైంగిక దాడులు అత్యంత హేయమని యూటీఎఫ్ నాయకుడు పీవీ రమణ పేర్కొన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జేబీ సరోజిని, న్యాయవాది సుదర్శన్ మాట్లాడారు.

పోక్సో చట్టంపై ఉపాధ్యాయులకు అవగాహన

హనుమాన్‌జంక్షన్: విద్యార్థినులపై ఉపాధ్యాయులు లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం ప్రకారం చర్యలు తప్పవని బాపులపాడు ఎంఈవో రాంబాలసింగ్ హెచ్చరించారు. గురువారం బాపులపాడు జడ్పీ హైస్కూల్‌లో మండలంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందికి పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థినులతో ఉపాధ్యాయులు ఉండాల్సిన తీరును వివరించారు. గన్నవరం ఐసీడీఎస్ సీడీపీవో వెంకటలక్ష్మి, ఎంఈవో-2 సురేష్‌కుమార్, జిల్లా బాలిక సంరక్షణాధికారి శ్యామల, సీఐ కేవీవీఎన్ సత్యనారాయణ, ఏఎస్సై రాజు, రిసోర్సుపర్సన్లు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. రేమల్లె, బాపులపాడు, వీరవల్లి హెచ్ఎంలు లూథర్ పాల్, టీవీ నాగేశ్వరరావు, పి.జగతి ప్రసంగించారు. .



స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకుంటున్న పెద అవుటపల్లి హైస్కూల్ హెచ్ఎం, పీఈటీ

పెద అవుటపల్లి, ఉంగుటూరు హైస్కూళ్లకు
స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులు

ఉంగుటూరు, ఆగస్టు 29: 2023-24లో క్రీడల్లో ప్రతిభ కనబర్చిన పాఠశాలలకు ఇచ్చే స్కూల్ ఆఫ్ స్పోర్ట్స్ ఎక్సలెన్సీ అవార్డులకు పెద అవుటపల్లి, ఉంగుటూరు జడ్పీ హైస్కూల్స్ ఎంపికయ్యాయని హెచ్ఎంలు కే.శేషుకుమారి, సీహెచ్ అనిత తెలిపారు. జిల్లాలో ఐదు పాఠశాలలు ఎంపికవగా, పెదఅవుటపల్లి హైస్కూల్ జిల్లాలో ప్రథమ, ఉంగుటూరు హైస్కూల్ ఐదో స్థానంలో నిలిచాయని వారు తెలిపారు. గురువారం అవనిగడ్డలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవంలో కలెక్టర్ డీకే బాలాజీ, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఈవో తాహెరా సుల్తానా చేతులమీదుగా వ్యాయామ ఉపాధ్యాయులు రాంబాబు, కాంతితో కలిసి తాము పురస్కారాలు అందుకున్నట్లు హెచ్ఎంలు తెలిపారు. డీఎస్‌డీవో ఝాన్సీ, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ డి.శ్రీనివాసరావు, ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జ్ టి.అజయ్ తదితరులు పాల్గొన్నారని తెలిపారు.

రేపు ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ల పంపిణీ

పెనమలూరు, ఆగస్టు 29: వచ్చే నెల మొదటి తారీఖు ఆదివారం కావడంతో ఈనెల 31నే పింఛన్లను పంపిణీ చేస్తామని తాడిగడప మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి పింఛన్ల పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి..ముగ్గురి అరెస్టు

ఉయ్యూరు, ఆగస్టు 29: కాటూరులో పేకాట శిబిరంపై ఉయ్యూరు రూరల్ పోలీసులు గురువారం దాడిచేసి ముగ్గురిని అరెస్టు చేశారని, వారి నుంచి రూ.3,050 స్వాధీనం చేసుకున్నారు. గ్రామ పరిధిలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందని, సిబ్బందితో కలిసి శిబిరంపై దాడి చేశామని, పేకాట ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్సై కె.సురేశ్‌బాబు తెలిపారు. ఎక్కడైనా పేకాట, కోడి పందేలు నిర్వహిస్తుంటే సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

నవోదయ విద్యాలయానికి కలెక్టర్ రాక నేడు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 29: వేలేరు జవహర్ నవోదయ విద్యాలయాన్ని కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం మధ్యాహ్నం సందర్శిస్తున్నట్లు విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించనున్నట్లు తెలిపారు. కలెక్టర్‌తో పాటు విద్యాశాఖ, ఇంజనీరింగ్ విభాగం అధికారులు కూడా హాజరవుతున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

ఉయ్యూరు, ఆగస్టు 29: హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ పుటినరోజును పురస్కరించుకుని గురువారం ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఫిజికల్ డైరెక్టర్ పి.చంద్రబాబును ప్రిన్సిపాల్ శివనాథ్, ప్రత్యేక అధికారి కె.సత్యనారాయణ, జూనియర్ కళాశాల డైరెక్టర్ వినయ్‌కుమార్ సత్కరించారు.

సూరంపల్లిలో ర్యాలీ

గన్నవరం: మండలంలోని పాఠశాలల్లో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సూరంపల్లి జడ్పీ హైస్కూల్‌లో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం హరిశరణ్, పీడీ డాక్టర్ బి.శాంతి కిరణ్, ఉపాధ్యాయులు గోవిందరాజులు, మురళీకృష్ణ, బాషా, రమేష్, సుభాషిణి, శారద పాల్గొన్నారు.



సూరంపల్లిలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

స్పోర్ట్స్ కిట్ల అందజేత

గన్నవరం జడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో వాలీబాల్ క్లబ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన క్రీడాకారులకు కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ద్వారా టీ షర్టులు, స్పోర్ట్స్ కిట్లను అసోసియేషన్ చైర్మన్ కేవీ రమణ, కార్యదర్శి కేవీఆర్ కిషోర్ అందజేశారు. వాలీబాల్ క్లబ్‌కు చెందిన రామారావు, చిన్నారావు పాల్గొన్నారు.



క్రీడా సామగ్రి, ప్రింటర్ అందజేస్తున్న ప్రొద్దుటూరు హైస్కూల్ పదో తరగతి 1973 - 74 బ్యాచ్ విద్యార్థులు

క్రీడా సామగ్రి, ప్రింటర్ అందజేత

కంకిపాడు: విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఈవో వి.ప్రసాద్ అన్నారు. ప్రొద్దుటూరు జిల్లా పరిషత్ పాఠశాల 1973-74 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు క్రీడా సామగ్రితో పాటు ప్రింటర్‌ను అందజేశారు. పాఠశాలలో క్రీడా ల్యాబ్‌ను ఎంఈవో ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయురాలు ఎం.అరుణకుమారి, పీటీ వి.రమేష్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన



కేసరపల్లిలో సర్పంచ్‌తో మాట్లాడుతున్న కేంద్ర బృందం

గన్నవరం, ఆగస్టు 29: మండలంలోని కేసరపల్లి, జక్కుల నెక్కలం గ్రామాల్లో జలజీవన్ మిషన్ పనులను పరిశీలించేందుకు కేంద్ర బృందం గురువారం పర్యటించింది. బృంద సభ్యులు కుల్‌శ్రేష్ఠ, సుధీర్ కుమార్ కేసరపల్లి శివారు దుర్గాపురం, చెంచుల కాలనీల్లో జలజీవన్ మిషన్ నిధులు రూ.20 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ పైప్‌లైన్‌ను పరిశీలించారు. ప్రతి ఇంటికి నీటి కనెక్షన్ ఉందా లేదా, స్వచ్ఛమైన నీరు అందుతోందా.. లేదా? అని ఆరాతీశారు. అంగన్వాడీలు, పాఠశాలలను సందర్శించి అక్కడ మంచినీటిని పరీక్ష చేశారు. వాటర్ ఫిల్టర్ బెడ్లు చూశారు. పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనికతో సమావేశమై గ్రామంలో జనాభా ఎంత మంది, వాటర్ కనెక్షన్లు అందరికీ ఉన్నాయా లేదా అని ఆరాతీశారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ కె.సుజాత పాల్గొన్నారు. జక్కులనెక్కలంలో పైపులైన్లు, తాగునీటిని పరిశీలించారు.

రాజ్యాంగ ఫలాలు సమానంగా అందాలి

ఉంగుటూరు, ఆగస్టు 29: సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగి, అట్టడుగున ఉన్న ప్రతి ఒక్కరికీ రాజ్యాంగఫలాలు సమానంగా అందాలన్నదే ఎస్సీ వర్గీకరణ నినాదమని ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకుడు మంద వేణు మాదిగ అన్నారు. తేలప్రోలులో గురువారం నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మంద కృష్ణమాదిగ 30ఏళ్ల సుదీర్ఘ పోరాట ఫలితంగా సుప్రీంకోర్టు ధర్మాసనం వర్గీకరణ న్యాయమైనదేనని తీర్పునిచ్చిందన్నారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎర్ర గుంట వినోద్, దేవదాసు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆర్థిక సాయం

ఉయ్యూరు, ఆగస్టు 29: విద్యాభివృద్ధికి మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కృషి చేస్తోందని సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు సాకి రాజేశ్, కొలసాని రవికుమార్ తెలిపారు. ఉయ్యూరుకు చెందిన 5, 8 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థులకు ఫీజుల నిమిత్తం సంస్థ ద్వారా రూ.15 వేలు ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. విద్యార్థుల తండ్రి ఏడాది నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారని, ఫీజులు చెల్లించేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. నాగకుమార్, అనిల్‌కుమార్, పారుపూడి శివకృష్ణ, మహంకాళి, పవన్ పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన అవసరం

గన్నవరం, ఆగస్టు 29: హెచ్ఐవీ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని హెచ్ఎం ఝాన్సీరాణి అన్నారు. బాలికల ఉన్నత పాఠశాలల్లో నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. టోల్ ఫ్రీ నెంబర్ 1097పై లింక్ వర్కర్ మాతంగి సదాలక్ష్మీ, కరుణ వివరించారు.

విద్యుత్ ఉండని ప్రాంతాలు నేడు

గన్నవరం, ఆగస్టు 29: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని మర్లపాలెం, చిన అవుటపల్లి, భార్గవినగర్, మేఘన రోడ్డు, వేపకుంట రోడ్డు, వేబ్రిడ్జి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు నిలిపివేస్తున్నట్లు ఏఈ వెంకటరాజు ఒక ప్రకటనలో తెలిపారు.



రేమల్లెలో హరికృష్ణ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అభిమానులు, టీడీపీ నాయకులు

హరికృష్ణకు ఘన నివాళి

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 29: టీడీపీ అభివృద్ధికి దివంగత నేత మాజీ మంత్రి నందమూరి హరికృష్ణ అందించిన సేవలు చిరస్మరణీయమని టీడీపీ రేమల్లె గ్రామ అధ్యక్షుడు యనమదల శ్రీనివాసరావు అన్నారు. గురువారం హరికృష్ణ వర్ధంతిని నిర్వహించారు. గ్రామంలోని హరికృష్ణ విగ్రహానికి శ్రీనివాసరావు నివాళులర్పించారు. కలపాల రాధాకృష్ణ, వడ్లమూడి కృష్ణారావు, పాలడుగు శ్రీకృష్ణ, కొనకళ్ల దుర్గారావు, కొల్లూరు చంద్రకాంత్, చల్లగుళ్ల పాండు రంగారావు, రవికిరణ్, వంశీ, అంగోతు సత్యనారాయణ, లింగవరపు లోకేష్ పాల్గొన్నారు.

కాదంబరి జెత్వానీకి న్యాయం చేయాలి

● టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్

కంకిపాడు, ఆగస్టు 29: ముంబైకు చెందిన నటి కాదంబరి జెత్వానీపై పోలీసు ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరు పోలీసు వ్యవస్థకే మాయని మచ్చ అని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. హోం మంత్రి స్వయంగా కేసును పర్యవేక్షించాలని, కాదంబరికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. వైసీపీ నాయకులతో పాటు అరాచకానికి పాల్పడిన పోలీసులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కాదంబరి కేసుతో వైసీపీ ప్రభుత్వానికి ఏం సంబంధం అని ప్రశ్నించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ ప్రభుత్వం అనేక అరాచకాలకు పాల్పడిందన్నారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డప్పు కళాకారులకు దుస్తుల పంపిణీ

కంకిపాడు, ఆగస్టు 29: అన్ని వర్గాల అభ్యున్నతే టీడీపీ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి అన్నే ధనయ్య అన్నారు. తన తల్లిదండ్రులు అచ్చియ్య, నిర్మలకుమారి జ్ఞాపకార్థం గురువారం డప్పు కళాకారులకు ధనయ్య దుస్తులు పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెడుతుందన్నారు. ఉపాధి హామీ నిధులు మంజూరు చేసి గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు చలసాని రాధాకృష్ణ, అన్నే కేశవరావు, కొల్లి గాంధి, నెరుసు సతీష్, రాజేష్, మధుసూదనరావు, కొండవీటి శివయ్య, లాం చంద్రరావు, గంగులు, వీరాస్వామి, మురళి, కొలుసు మురళి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు

హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 29: నూజివీడు రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం సామూహిక రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చక్రావధానుల సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్టీ కాకాని బాబు అరుణ దంపతులు వ్రతంలో పాల్గొన్న భక్తులకు ఉచితంగా పూజాసామగ్రిని అందజేశారు. ఆలయ ఈవో వైశ్రీనివాస్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	109, 118, 129
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.25

పవన్‌కల్యాణ్ పుట్టిన రోజున 40 వేల మొక్కల పంపిణీ



మచిలీపట్నం టౌన్ : ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పుట్టిన రోజు సందర్భంగా సెప్టెంబర్ 1న హిందూ కళాశాలలో నిర్వహించే 40 వేల మొక్కల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా మాజీ ఎంపీ, హిందూ కళాశాల అనుబంధ సంస్థల ఛైర్మన్ కొనకళ్ల నారాయణ రావును జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ ఆహ్వానించారు. కొట్టె వెంకట్రావు, గడ్డం రాజు, వంపుగడల చౌదరి తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ డిపోకు ఆరు కొత్త బస్సులు

● రెండు కరకట్ట ఎక్స్‌ప్రెస్‌లు ప్రారంభం



అవనిగడ్డ, ఆగస్టు 29 : అవనిగడ్డ డిపోకు కొత్తగా కేటాయించిన రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులను ఎమ్మెల్యే మండలి బుద్దప్రసాద్ గురువారం జెండా ఊపి ప్రారంభించారు. విజయవాడ నుంచి కరకట్ట మీదుగా ఈ రెండు బస్సులు తిరుగుతాయన్నారు. డిపోకు కొత్తగా మొత్తం ఆరు బస్సులు కేటాయించగా, వాటిలో రెండు స్టార్ లైనర్, రెండు సూపర్ లగ్జరీ, రెండు ఎక్స్‌ప్రెస్ బస్సులు ఉన్నాయన్నారు. డిపో అభివృద్ధికి రాబోయే రోజుల్లో కృషి చేస్తానని తెలిపారు. జిల్లా ప్రజా రవాణా అధికారి వాణిశ్రీ, డిపో మేనేజర్ హనుమంతరావు, ట్రాఫిక్ అసిస్టెంట్ మేనేజర్ సిహెచ్.శ్రీలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ దివ్య, మండలి వెంకట్రామ్, బండే రాఘవ పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి చర్యలు : కుమార్‌రాజా



పెదపారుపూడి : రోడ్ల అభివృద్ధికి టీడీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. వెంట్రప్రగడ గ్రామ శివారు పెద దళితవాడకు వెళ్లే రహదారి నిర్మాణ పనులను గురువారం ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా ప్రారంభించారు. రూ.30 లక్షలు వెచ్చించి తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు. అన్ని రోడ్లను త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, చప్పిడి కిషోర్, చిలక ఆంజనేయులు, గొరిపర్తి రవికుమార్, కూచిపూడి సుబ్బయ్య, బుడ్డాలు, ఎం.విజయబాబు, కూచిపూడి శ్రీనివాసరావు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

కాశిపూడి ప్రాథమిక పాఠశాల పునఃప్రారంభం



గుడివాడ రూరల్ : కాశిపూడి గ్రామంలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్నారన్న కారణంతో మూడేళ్ల క్రితం మూసివేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గ్రామ పెద్దలతో కలిసి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కలతోటి థామస్ ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కుంటి సాకులతో గత ప్రభుత్వం అనేక గ్రామాల్లో చిన్నారులకు విద్యను దూరం చేసిందన్నారు. ప్రతి ఒక్కరికి ప్రభుత్వ విద్యను అందించాలనే లక్ష్యంతో సీఎం చంద్రబాబు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు విజయ్, బాలాజీ, టీడీపీ నాయకులు చేకూరి జగన్మోహనరావు, గ్రామ పెద్దలు గొరిపర్తి సుబ్బారావు, గుండే సునీల్, గొరిపర్తి నాగరాజు, గాలంకి జనార్దనరావు, వేమూరి మల్లిఖార్జునరావు, పంతగాని రాధా, చప్పిడి పాండు రంగారావు తదితరులు పాల్గొన్నారు.



మాతృభాషా దినోత్సవంలో గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మండలి



కూచిపూడి సిద్దేంద్ర కళాపీఠం వద్ద..



పాండురంగా మున్సిపల్ పాఠశాలలో జాతి నేతల వేషధారణలో విద్యార్థులు

మాతృభాషతో జ్ఞాన సముపార్జన

● తెలుగు భాషా దినోత్సవంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, ఆగస్టు 29 : మాతృభాష జ్ఞానాన్ని పెంచుతుందని, మేధాశక్తినిస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి, తెలుగు భాషా దినోత్సవాన్ని గురువారం గాంధీక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి విగ్రహానికి, గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కూటమి నేతలు కొల్లూరి వెంకటేశ్వరరావు, దిరిశం వెంకట్రావు, బండే రాఘవ, బండ్రెడ్డి హరి, బచ్చు రఘునాథ్, మేడికొండ విజయ్, దాసినేని శ్రీను, మండలి రామ్మోహనరావు, భోగాది శివ విష్ణు, కూనపరెడ్డి చంద్రశేఖర్, గుడివాక హరి, సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. **మచిలీపట్నం టౌన్** : జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని వివిధ విద్యా సంస్థల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దినోత్సవాలు జరిగాయి. చిలకలపూడి మునిసిపల్ హైస్కూల్‌లో హెచ్‌ఎం ఎం.వి. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించారు. భగవద్గీత పోటీల్లో 10వ తరగతి విద్యార్థి కిరణ్‌దత్ భగవద్గీతలో ఎక్కువ శ్లోకాలు చెప్పి బహుమతి సాధించాడు. కిరణ్‌దత్‌ను హెచ్‌ఎం కృష్ణమూర్తి అభినందించి జ్ఞాపిక, బహుమతులు అందజేశారు. విద్యార్థుల వేషధారణ అలరించింది. స్వాతంత్ర్య ఉద్యమం ఉట్టిపడేలా లఘునాటికలు ప్రదర్శించారు. అప్పినీడి వెంకట రామాంజనేయులు, రమేష్, రత్నరాజు, ఎమిలియారాణి, ఉషాకిరణ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు. నోబుల్ కళాశాలలో నిర్వహించిన తెలుగు భాషా దినోత్సవంలో తెలుగు శాఖాధిపతి నాగమణి మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.జె. ఎర్నెస్ట్ అధ్యక్షతన జరిగిన వేడుకల్లో డాక్టర్ శాంతి, శివాజీ, గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్టార్ ప్లస్ పాఠశాలలో విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రదర్శన నిర్వహించారు. స్టార్ కళాశాల మెంటార్ పి. శ్రీరామ్ నిర్వహించిన కార్యక్రమంలో అంగలూరు డైట్ విశ్రాంత ప్రిన్సిపాల్ ఎం.వి.జి. ఆంజనేయులు తెలుగుభాషలోని మాధుర్యాన్ని వివరించారు. **పెడన** : విద్యార్థులు తెలుగుభాష పట్ల మక్కువ పెంచుకుని తెలుగుబాషలో రచనలు చేయాలని చెన్నూరు జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సిద్ధినేని సౌజన్య అన్నారు. తెలుగుభాషా దినోత్సవం సందర్భంగా గురువారం ఆమె హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో కలిసి పాఠశాల పత్రిక తెలుగుతేజం ఆరో సంచికను ఆవిష్కరించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు, పదవ తరగతిలో తెలుగు సబ్జెక్టులో 30 మార్కులకు పైగా సాధించిన 27 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. **కూచిపూడి** : కూచిపూడి సిద్దేంద్ర కళాపీఠంలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాపీఠం ఆవరణలోని తెలుగుతల్లి విగ్రహానికి నాట్యాచార్యులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. తెలుగుభాష గొప్పదనం, తెలుగుభాషాభివృద్ధికి కృషి చేసిన వక్తలు, సాహితీ వేత్తలను గుర్తు చేసుకున్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు తెలుగుభాషాభివృద్ధికి చేసిన సేవలను కొనియాడారు. కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, డాక్టర్ యేలేశ్వరపు శ్రీనివాస్, నాట్య అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. **ఘంటసాల** : శ్రీకాకుళం శాఖ గ్రంథాలయంలో తెలుగుభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం టి.నాగబాబు, గ్రంథాలయ శాఖ అధికారిణి దారా సుజాత, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్** : అశ్వారావుపాలెంలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రేపల్లె రవికిరణ్ మాట్లాడుతూ తెలుగు భాష ఔన్నత్యాన్ని వివరించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **కోడూరు** : ఉల్లిపాలెం వారధి తెలుగుతల్లి విగ్రహానికి కూటమి నేతలు పూలమాల వేసి అంజలి ఘటించారు. గిడుగు రామ్మూర్తి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కూటమి నేతలు మర్రే గంగయ్య, పూతబోయిన కరుణ కుమార్, కాగిత రామారావు, పూతబోయిన సీతారత్న సాయిబాబు, బడే రాజశేఖర్, పూషడపు బాను, పూతబోయిన లక్ష్మణరావు, కడవకొల్లు మల్లి, వడ్డీ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు. **పామర్రు** : తెలుగు భాష ఔన్నత్యాన్ని పరిరక్షించుకునే సమయం ఆసన్నమైందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ అన్నారు. తెలుగు భాషా దినోత్సవాన్ని అధ్యాపకుడు శేషుకుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష విశిష్టతపై పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల అధ్యాపకులు మురళి, డాక్టర్ మాధవి, ప్రభావతి, శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, ఆర్‌సీఎం ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. **గుడ్లవల్లేరు** : శ్రీ సాయి విద్యా నికేతన్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు పాఠశాల కరస్పాండెంట్ సింగంశెట్టి ఆదినారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఉల్లిపాలెం వారధి తెలుగుతల్లి విగ్రహం వద్ద..



రుస్తుంబాద పాఠశాలలో మాట్లాడుతున్న డీఈవో



పామర్రులో మాట్లాడుతున్న సీఐ శుభాకర్



ఘంటసాల, మోపిదేవిలో మాట్లాడుతున్న ఎస్సైలు



గుడ్లవల్లేరు పాఠశాలలో మాట్లాడుతున్న ఎస్సై

బాలికల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి

● పోక్సో చట్టంపై అవగాహన సదస్సులో డీఈవో తాహేరా సుల్తానా

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 29 : పాఠశాలల్లో బాలికల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవని డీఈవో తాహెరా సుల్తానా అన్నారు. రుస్తుంబాద బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం డివిజన్‌లోని ఉపాధ్యాయులకు పోక్సో యాక్టుపై అవగాహనా సదస్సు నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ పీడీ సువర్ణ మాట్లాడుతూ, విద్యార్థినుల పట్ల ఉపాధ్యాయులు తల్లిదండ్రుల వలె బాధ్యత తీసుకోవాలన్నారు. ఆర్‌పేట సీఐ ఏసుబాబు, రూరల్ ఎస్ఐ సత్యనారాయణ, మచిలీపట్నం సీడీపీవో గ్లోరీ, ఎంఈవో దుర్గాప్రసాద్, వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. **పామర్రు** : ఉపాధ్యాయులు పోక్సో చట్టం పట్ల అవగాహన కలిగి సత్ప్రవర్తనతో మెలగాలని పామర్రు సీఐ శుభాకర్ అన్నారు. మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఎంపీడీవో రామకృష్ణ ఆధ్యంలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. చిన్నారులపై లైంగిక వేధింపుల ఘటనల్లో కొందరి ఉపాధ్యాయుల పాత్ర ఆందోళన కలిగిస్తోందన్నారు. పోక్సో చట్టం ఉపాధ్యాయులు అవగాహన కలిగి క్రమశిక్షణ కలిగిన విద్యను బోధించాలన్నారు. ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, ఎంపీడీవో రామకృష్ణ మాట్లాడుతూ, పోక్సో చట్టం పట్ల సరైన అవగహన లేకపోవడంతో సమాజంలో అనర్థాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎంఈవో గుమ్మడి పద్మవాణి, వైస్ ఎంపీపీ ఆరుమళ్ల రమాదేవి, ఎస్సై సిహెచ్ అవినాష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఘంటసాల** : విద్యార్థులను సొంత పిల్లలుగా భావించి విద్యాబుద్ధులు నేర్పించాలని ఘంటసాల ఎస్సై కె.ప్రతాప్‌రెడ్డి ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ డికే.బాలాజీ, జిల్లా విద్యాశాఖ అధికారిణి తాహెరా సుల్తానా ఆదేశాల మేరకు పోలీసు, విద్య, ఐసీడీఎస్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఘంటసాలలోని మహాత్మాగాంధీ జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. ఎంఈవో-2 ఎండి.మోమిన్, హైస్కూల్ హెచ్‌ఎం శ్రీరంగ వల్లి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు నాగమణి, మేరీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **మోపిదేవి** : విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించాలని మోపిదేవి ఎస్సై వై.వి.సత్యనారాయణ, ఎంఈవో దుర్గాసాగర్ సూచించారు మండల పరిషత్ కార్యాలయంలో విద్యార్థుల నడవడికపై ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థిని, విద్యార్థులకు వారి అలవాట్లు, నడవడికపై పూర్తి అవగాహన కలిగి ఉండేలా బోధించాలన్నారు. సమాజంలో జరుగుతున్న మంచి, చెడులను వివరించాలన్నారు మండలంలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **నాగాయలంక** : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది నాంచారయ్య నాయుడు మాట్లాడుతూ విద్యార్థులకు చిన్న తనం నుంచే గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలియజేయాలన్నారు. సీఐ యువకుమార్ మాట్లాడుతూ ఇటీవల నమోదైన పోక్సో కేసుల గురించి వివరించారు. ఎస్సై రాజేష్, ఎంఈవోలు టివి.ఎం.రామదాసు, ఏ.రామారావు, హెచ్‌ఎంలు జ్యోతిర్మయి, శివ ప్రసాద్, ప్రసాదరావు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలాజ్యోతి పాల్గొన్నారు. **గుడ్లవల్లేరు** : పాఠశాలల్లో బాలబాలికలకు మంచి స్పర్శ, చెడ్డ స్పర్శలపై అవగాహన కల్పించాలని ఎస్సై సత్యనారాయణ అన్నారు. మండల పరిషత్ పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై పోక్సో చట్టం-2012 ప్రకారం కఠినమైన శిక్షలు విధిస్తారన్నారు. పోక్సో చట్టంపై అవగాహనతో అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. ఎంఈవో జి.జగన్మోహనరావు, ఐసీడీఎస్ సూపరవైజర్ వాణి పాల్గొన్నారు.

నాగాయలంక ఎస్సైగా రాజేష్



నాగాయలంక : నాగాయలంక పోలీస్ స్టేషన్ ఎస్సైగా కలిదిండి రాజేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ ఇంటిలిజెన్స్ విభాగం నుంచి బదిలీపై ఆయన నాగాయలంక వచ్చారు.

గుడ్లవల్లేరు ఎస్సైగా సత్యనారాయణ



గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ ఎస్సైగా ఎన్.వి.వి సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

పెడన ఎస్సైగా సత్యనారాయణ



పెడన : పెడన ఎస్సైగా గంట్ల సత్యనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. సత్యనారాయణ గుడ్లవల్లేరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయన గతంలో ఇక్కడ ఎస్సై-2గా పనిచేశారు. సత్యనారాయణకు స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

మద్యం సీసాలు స్వాధీనం

చల్లపల్లి : లక్ష్మీపురం శివారు రామానగరంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న పరిశే రాంబాబును అదుపులోకి తీసుకుని, 16 మద్యం సీసాలను స్వాధీనపరచుకున్నట్లు ఎస్సై పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

కోడూరు మండల సర్వసభ్య సమావేశం నేడు

కోడూరు : మండల అత్యవసర సమావేశం శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ కొండవీటి వెంకట కుమారి అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో ఆర్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధి హామీ పథకం పనుల ఆమోదం నిమిత్తం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

బంటుమిల్లి : సెప్టెంబరు 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగపరచుకోవాలని బంటుమిల్లి ఫస్ట్ క్లాస్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, మండల న్యాయసేవా సాధికార కమిటీ ఛైర్మన్ ఎం. భాస్కరరావు అన్నారు. కోర్టు ప్రాంగణంలో గురువారం బార్ అసోసియేషన్ సభ్యులతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. రాజీ పడదగ్గ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలన్నారు. న్యాయ వాదులు సహకరించాలని కోరారు. యాళ్ల సోమశేఖర్, కుటుంబ శాస్త్రి, పళ్లెం వీర వెంకటేశ్వరరావు, తమ్మన సురేష్, మోజెస్, అంగర రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విలువ ఆధారిత ఉత్పత్తులపై శిక్షణ

ఘంటసాల : ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో దాలిపర్రు గ్రామంలో కూరగాయలతో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీపై మూడు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. గృహ విజ్ఞాన శాస్త్రవేత్త జి.కృష్ణవేణి కూరగాయలలో పోషక విలువలు, ఆరోగ్య పరమైన ఉపయోగాలు, కూరగాయలను నిల్వ చేసుకునే విధానం గురించి వివరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ మంజువాణి, డా.బి.నవీన్, దాలిపర్రు గ్రామ సర్పంచ్ డి.శాంతకుమారి, దాలిపర్రు గ్రామ మహిళలు పాల్గొన్నారు.

వాసవీ ఇంజనీరింగ్‌లో క్రీడాదినోత్సవం

పెడన రూరల్ : నందమూరు వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు, మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని కళాశాల కరస్పాండెంట్ కాకి కుమార్ బాబు అన్నారు. విద్యార్థులు సిబ్బందికి ఖోఖో, వాలీబాల్, త్రో బాల్, టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ షటిల్ తదితర ఆటల పోటీలు నిర్వహించి ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపల్ బీఆర్ ఎస్ రెడ్డి, ఎస్‌కె ప్రసాద్, డైరక్టర్ దోసపాటి బాబా పాల్గొన్నారు.

నార్త్‌వల్లూరు పీఏసీఎస్‌లో విచారణ

తోట్లవల్లూరు : నార్తువల్లూరు పీఏసీఎస్‌లో ఎరువుల విక్రయంలో వచ్చిన రూ.12.29 లక్షల తేడాపై సంబంధిత అధికారులు గురువారం విచారణ చేపట్టారు. పీఏసీఎస్ గోడౌన్ కూలిపోవటంతో మధుసూదనరావుకి చెందిన రైస్‌మిల్లు అద్దెకు తీసుకుని ఎరువుల వ్యాపారం చేపట్టగా తడిసిపోవటంతో రూ 1,500లకు అమ్మాల్సిన ఎరువుని రూ.450 చొప్పున విక్రయించటంతో నష్టం వచ్చిందని సీఈవో దయాకర్ తెలిపారు.

సాయిమందిర వార్షికోత్సవం

మోపిదేవి : పెదప్రోలు రామసాయిమందిరం 17వ వార్షికోత్సవం గురువారం వైభవంగా జరిగింది. టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొనకళ్ల జగన్నాథరావు, మండలి వెంకట్రామ్ విచ్చేసి బాబాకు పూజలు నిర్వహించి, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఛైర్మన్ నంబూరి ఆంజనేయులు కమిటీ సభ్యులు కెవి.ఎన్.కె.కోటేశ్వరరావు, మండల టీడీపీ అధ్యక్షుడు నడకుదుటి జనార్దనరావు, రావి నాగేశ్వరరావు, మోర్ల రాంబాబు, కోట పద్మావతి, రత్న ప్రసాద్, నాదెళ్ల శరత్ చంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వేములమడలో పశువైద్య శిబిరం

కూచిపూడి : వేములమడలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. 95 పశువులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. పశువుల షెడ్ల నిర్మాణం, మినీ గోకులాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసరావు వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. మొవ్వ ఏడీఏ దివాకర్, సర్పంచ్ సీతారామయ్య, డాక్టర్ సృజన్, డాక్టర్ మనోజ్, డాక్టర్ హరిత, సుధాకర్, శ్యామలా, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు భరించలేక ఆత్మహత్య

కోడూరు : విశ్వనాథపల్లికి చెందిన బత్తుల నల్లబాబు (37) ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై శిరీష తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు.



ఎస్సై అర్జునరాజు చొరవ

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు ఎస్సై అర్జునరాజు గాయపడిన బాలుడికి రక్తదానం చేసి శాంతి భద్రతలే కాదు ప్రాణ రక్షణలోనూ ముందుంటామని నిరూపించారు. పెనమకూరుకు చెందిన రెండున్నరేళ్ల గంటా అభినవ్‌ను గొర్రెలు ఈడ్చుకెళ్లడంతో తీవ్రంగా గాయపడ్డాడు. తల్లిదండ్రులు వెంటనే ఉయ్యూరు ఆస్పత్రికి తీసుకెళ్ళగా మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఎస్సై ఎం. అర్జునరాజు విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి బాలుడికి రక్తదానం చేశారు. ఎస్సై చొరవను వైద్యులు, గ్రామస్థులు అభినందించారు.

యూరియా ఎక్కువగా వాడొద్దు

గుడివాడ రూరల్ : రైతులు ఎక్కువ మోతాదులో యూరియా వేయవద్దని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. వలివర్తిపాడులోని వరి పొలాలను ఏవో బోలెం అనంతలక్ష్మితో కలిసి ఏడీఏ రమాదేవి పరిశీలించారు. రైతులు రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడితే తెగుళ్ల బారిన పడే అవకాశం ఉందని తెలిపారు. వలివర్తిపాడు, మెరకగూడెం రైతులు పాల్గొన్నారు.

ఇంజన్ల దొంగల అరెస్టు

బంటుమిల్లి : అర్తమూరు గ్రామానికి చెందిన రెండు ఇంజన్లు, వాటి సామాగ్రి చోరీ చేసిన జయపురానికి చెందిన ఈడే వెంకట నారాయణ, బంటుమిల్లికి చెందిన అంకం నాగేంద్ర కుమార్‌లను ఎస్సై గణేష్ అరెస్టు చేశారు. ఇంజన్లు, వాటి సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేశారు. నిందితులను కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించారు.